ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 14 ఏప్రిల్ 2024

నేడు చంద్రబాబు ప్రజాగళం



- మధ్యాహ్నం 2.30 గంటలకు పాయకరావుపేటలో... సాయంత్రం 5.35 గంటలకు గాజువాకలో సభలు
- 16న చోడవరం, ఎలమంచిలిలో ప్రజాగళం
- హాజరుకానున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

అనకాపల్లి/ పాయకరావుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని పాయకరావుపేట, గాజువాకల్లో ప్రజాగళం సభల్లో పాల్గొంటారు. ఆయన మధ్యాహ్నం 12.55 గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 2.05 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 2.35 గంటలకు పాయకరావుపేట వెళతారు. హెలి ప్యాడ్ నుంచి ర్యాలీగా మంగవరం రోడ్డు కూడలికి వస్తారు. అక్కడ పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం సూర్యమహల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల సభలో పాల్గొంటారు. చంద్రబాబు రాక సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. సభకు సుమారు 50 వేల మంది హాజరవుతారని నేతలు అంచనా వేస్తున్నారు. సభ అనంతరం సాయంత్రం 4.40 గంటలకు హెలికాప్టర్‌లో ... మిగతా 8వ పేజీలో



పాయకరావుపేట హెలీ ప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిత

ఈవీఎంలు వచ్చేశాయ్



చోడవరం చేరుకున్న ఈవీఎంలను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాహనం నుంచి దించుతున్న సిబ్బంది

సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం)లు, శనివారం నియోజకవర్గాలకు చేరుకున్నాయి. వీటిలో కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు ఉన్నాయి. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు వాటిని భద్రపరిచారు. పార్లమెంట్ స్థానాలకు సంబంధించిన ఈవీఎంలు ముందుగా చేరుకున్నాయని, ఆదివారం శాసనసభ స్థానాలకు సంబంధించిన సామగ్రి వస్తుందని అధికారులు తెలిపారు.

ఉపాధికి నీడ కరవు

మండుటెండలో పనిచేస్తున్న కూలీలు

- అందుబాటులో లేని తాగునీరు
- పని ప్రదేశాల్లో కనిపించని టెంట్లు
- వడదెబ్బకు గురయ్యే ప్రమాదం
- సౌకర్యాల కల్పనపై దృష్టి సారించని అధికారులు

రావికమతం, ఏప్రిల్ 13:

నీడ లేక మండుటెండలో ఉపాధి కూలీలు ఆపసోపాలు పడుతున్నారు. గత కొద్దిరోజులుగా ఎండలు విపరీతంగా పెరిగిపోవడంతో ఉదయం 9 గంటల నుంచే తీవ్రమైన వేడి, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇక ఉపాధి కూలీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాల కల్పనపై యంత్రాంగం దృష్టి సారించకపోవడతో నీడ నిచ్చే టెంట్లు, తాగునీరు, ఇతర వసతులకు దూరంగా మండుటెండలోనే పనిచేయాల్సిన పరిస్థితి ఎదురవుతోందని కూలీలు వాపోతున్నారు.

రావికమతం మండలంలో 320 గ్రూపులకు చెందిన 8,370 మంది ఉపాధికూలీలు చెరువులు, పంట కాలువల్లో పూడిక తీత, మట్టిరోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. వీరిలో ఎవరైనా ఎండతీవ్రతతో అలసటకు గురై నీరసిస్తే పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలైన టెంట్, ప్రథమ చికిత్స కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలి. అయితే ఆయా ప్రదేశాల్లో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. కూలీలే ఇంటి నుంచి సీసాల్లో నీటిని తెచ్చుకుంటున్నారు. గతంలో నీటిని అందుబాటులో ఉంచేందుకు వీలుగా ఒకరిద్దరిని ఏర్పాటు చేసేవారు. కాగా కొన్ని పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉండగా, మరి కొన్ని చోట్ల ... మిగతా 8వ పేజీలో



దాసరియ్యపాలెం కన్నుల చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

నీడలేక ఇబ్బందులు



ఆరు వారాలుగా కన్నుల చెరువులో పూడిక తీత పనులు చేస్తున్నాం. భూమిలో తేమ లేక మట్టిలో పలుగు దిగడం లేదు. పూడిక తీత పనులు కష్టంగా ఉన్నాయి. తొమ్మిది గంటలు దాటితే ఎండ ఎక్కువై పనిచేయలేకపోతున్నాం. పని చేసే ప్రాంతంలో నీడలేక సొమ్మసిల్లుతున్నాం. గతంలో టెంట్‌లు ఉండేవి. ఇప్పుడు లేవు. రోజు కూలీ కూడా ఎంత వస్తుందో తెలియడం లేదు.

\- జనపు రెడ్డి అప్పారావు,
ఉపాధి కూలీ, దాసరయ్యపాలెం.

ఆస్పత్రుల్లో భోజన పంపిణీకి బ్రేక్!

- ఈనెల 16 నుంచి నిలిపివేస్తామన్న కాంట్రాక్టర్లు
- ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల కాకపోవడమే కారణం
- జిల్లాలో రూ.1.8 కోట్ల బిల్లులు పెండింగ్
- వైసీపీ సర్కారు తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు, వారి సహాయకులకు అందిస్తున్న భోజనం పంపిణీకి బ్రేక్ పడనుంది. భోజనం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఈనెల 16 నుంచి భోజన పంపిణీని నిలిపివేసేందుకు వారు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు 15న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని కలిసి సమస్యను వివరించి, 16 నుంచి పంపిణీ నిలిపివేసేందుకు నిర్ణయించినట్టు సమాచారం.

జిల్లాలోని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రితో పాటు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి, పెందుర్తి, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, నక్కపల్లి, కె.కోటపాడు, కోటవురట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న రోగులకు ప్రభుత్వం భోజనం పంపిణీ చేస్తుంది. ఇందుకోసం 2023 ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి పంపిణీ బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించింది. కాగా మేలో ఒక నెలకు సంబంధించిన బిల్లు మాత్రమే కాంట్రాక్టర్లకు చెల్లించిన ప్రభుత్వం ఆ తరువాత తొమ్మిది నెలలుగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరిగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లుల కోసం నెలల తరబడి వేచివుండాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ప్రతినెలా సంబంధిత ఆస్పత్రుల వైద్యాధికారులు కాంట్రాక్టర్ల బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేస్తున్నా, చెల్లింపులు జరగడం లేదు.

ప్రతిరోజు ఆస్పత్రిల్లో ఇన్‌పెషెంట్‌కు ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో రోగులకు భోజనం వడ్డిస్తున్న చిత్రం

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కశింకోట, ఏప్రిల్ 13: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి తుని రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ లోవరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బయ్యవరం-నర్సింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్ పక్కన శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి జారి పడి మృతి చెందాడు. ఈ ప్రమాదంలోసుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, ఇతను నిక్కరు ధరించి లేత నాచురంగు టీ షర్టు, నలుపురంగు ఛాయ గల మొహం, ఎడమ చేయిపైన రాము అని హిందీ అక్షరాలతో పచ్చబొట్టు కలిగి ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని ఇన్‌చార్జి ఎస్ఐ లోవరాజు తెలిపారు. మరిన్ని వివరాలకు 7674941459 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై దాడి

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 13 : మండలంలోని చూచుకొండ వద్ద పేకాట స్థావరం పై శనివారం పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 87,660 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తొమ్మిది కిలోల గంజాయితో ఆరుగురు అరెస్టు

నర్సీపట్నం అర్బన్/ పాయకరావుపేట, ఏప్రిల్ 13 : మండలంలోని గబ్బాడ సమీపంలో ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసినట్టు నర్సీపట్నం రూరల్ ఎస్ఐ భీమరాజు తెలిపారు. నెల్లిమెట్ట జంక్షన్ వద్ద వాహన తనిఖీ చేపడుతుండగా, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు గంజాయితో వస్తూ పట్టుపడ్డారన్నారు. అమలాపురం గ్రామానికి చెందిన పైల నాయుడు, కారు భాను, వేములపూడికి చెందిన అల్లు రమణ, పోలిపర్తి వెంకటరమణలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. అతడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇదిలావుంటే, పాయకరావుపేట తాండవ షుగర్స్ చెక్‌పోస్టు వద్ద శనివారం ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు వివరాలిలా ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేటలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో నర్సీపట్నం- తుని ఆర్టీసీ బస్సులో ఉన్న ఇద్దరు వ్యక్తులు దిగి పారిపోయేందుకు ప్రయత్నించగా వారి వెంబడించి పట్టుకున్నారు. వీరి వద్ద ఉన్న చేతి సంచిలో నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన బి.శ్యామలరావు, ఎ.సురేష్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కి తరలించినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు.

4,400 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

లంకెలపాలెం, ఏప్రిల్ 13: పెదముషిడివాడ వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 4,400 కేజీల రేషన్ బియ్యాన్ని (పీడీఎస్ రైస్) శనివారం పరవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. లంకెలపాలెం నుంచి సబ్బవరం వైపు బొలెరో వాహనంలో 4,400 కేజీల రేషన్ బియ్యాన్ని పూసర్ల అచ్చిరాజు, మురుగుతి రాజు తీసు కువెళుతుండగా పెదముషిడివాడ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. వ్యాన్‌లో రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించి, రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేశారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

38 మద్యం సీసాలు సీజ్



పట్టుబడిన మద్యం సీసాలను చూపుతున్న ఎస్ఐ రామారావు

నాతవరం, ఏప్రిల్ 13 : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో శనివారం 38 మద్యం సీసాలను సీజ్ చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. జిల్లేడిపూడికి చెందిన అల్లు రమణ, తాళ్ళపాలేనికి చెందిన ఈరే జోగరావులు అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరి వద్ద నుంచి సదరు సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే , నాతవరం పరిసర ప్రాంతాలలో సారా బట్టీలపై దాడి చేసి నాలుగు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.

తుమ్మపాల జంక్షన్‌లో...

అనకాపల్లి టౌన్: తుమ్మపాల జంక్షన్‌లో ఒక వ్యక్తి నుంచి 14 మద్యం బాటిళ్ల శనివారం స్వాధీనం చేసుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. వెంకుపాలెం గ్రామానికి చెందిన ఎం.సురేష్ 14 మద్యం క్వార్టర్ బాటిళ్లను పట్టుకుని వెళ్తుండగా పట్టుకున్నామని, ఈమేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

1100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నర్సీపట్నం, ఏప్రిల్ 13 : మునిసిపాలిటీ పరిధిలోని సుబ్బారాయుడుపాలెంలో శనివారం దాడి చేసి పదకొండు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. సిబ్బందితో కలిసి ఈ దాడి చేసినట్టు చెప్పారు.

నేడు జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 13: గొలుగొండ మండలం లింగంపేటలో నూకాలమ్మ జాతర వైభవోపేతంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఏడో రోజైన ఆదివారం మధ్యాహ్నం జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సీలేరు, భద్రాచలం నైట్ సర్వీసులు రద్దు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 13: విశాఖ నుంచి సీలేరు, భద్రాచలం నైట్ సర్వీసులను రద్దు చేస్తూ ప్రజా రవాణా శాఖ (పీటీడీ) విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులు శనివారం నుంచి మూడు రోజుల పాటు మన్యం బంద్ ప్రకటించడం వల్ల అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. విశాఖ నుంచి సీలేరుకు ఒకటి, భద్రాచలానికి రెండు నైటు సర్వీసులు ఉన్నాయి. ఈ మూడింటిని రద్దు చేశారు. పగటి వేళలో భద్రాచలం వెళ్లాల్సిన సర్వీసుల రూటు మార్చారు. విశాఖ నుంచి నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు, మోతుగూడెం మీదుగా భద్రాచలం రాకపోకలు సాగించే సర్వీసులను విశాఖ, రాజమండ్రి, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట మీదుగా భద్రాచలానికి నడుపుతున్నారు. పగలు నడిచే ఆరు సర్వీసులు కూడా మూడు రోజుల పాటు ఇదే రూట్‌లో ఆపరేట్ చేస్తామని ద్వారకా బస్‌స్టేషన్ మేనేజర్ అమర సింహుడు తెలిపారు. ఈ రెండు రూట్లలోని ప్రయాణికులు ఈ విష యాన్ని గమనించాలని ఆయన కోరారు.

విశాఖ.. భవానీపట్న పాసింజర్ రైళ్లు రాయగడ వరకే..

విశాఖపట్నం, ఏప్రిల్ 13: సంబల్‌పూర్ డివిజన్‌లో భద్రత సంబంధిత పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలిక రద్దు చేసిన విశాఖ, భవానీపట్న-విశాఖ పాసింజర్ రైళ్ల సర్వీసులను (08504/08503) ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 15 నుంచి పునఃప్రారంభించి గమ్యాలను కుదించి నడపనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. దీంతో 08504 నంబరు గల రైలు ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు విశాఖ నుంచి రాయగడ వరకు, తిరుగు ప్రయాణంలో 08503 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి 25 వరకు రాయగడ నుంచి విశాఖకు రానుంది. రాయగడ, భవానీపట్న మధ్య రాకపోకలు తాత్కాలికంగా ఉండవని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఇరవై గ్రామాల ప్రజలకు ఇక్కట్లు !

తొమ్మిది నెలలుగా సా... గుతున్న ఆర్ఈసీ రోడ్డు పనులు

- పెదమదీనా- గున్నెంపూడి మధ్య తేలిన రాళ్లు
- రాకపోకలకు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తవ్వేసిన కేబీ రోడ్డు టూ ఆర్ఈసీ రోడ్డు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 13 : మండలంలోని రావికమతం, ఈశ్వరవానిపాలెం, చోడవరం (ఆర్ఈసీ) రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రాకపోకలకు రెండు మండలాలకు చెందిన ఇరవై గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హడావుడిగా ఈ పనులు చేపట్టడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు, మూడు అడుగులు వెనక్కి అన్నచందాన మారిందని అంటున్నారు. ఆగస్టులో ప్రారంభించిన ఆర్ఈసీ రోడ్డు నిర్మాణ పనులు రెండు పర్యాయాలు నిలిచిపోవడంపై ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధుల తీరును అంతా దుమ్మెత్తి పోస్తున్నారు. కశింకోట- బంగారుమెట్ట (కేబీ) రోడ్డు నుంచి వయా పెదమదీనా, గున్నెంపడి, ఆర్ఈసీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీనిని అభివృద్ధి చేయాలని గత నాలుగేళ్లుగా ప్రజలు చేసిన



పెదమదీనా వద్ద పైకి తేలిన వెట్‌మిక్స్ మెటల్

విజ్ఞప్తుల మేరకు ఎట్టకేలకు రూ.1.83 కోట్ల నిధులు మంజూరు చేశారు. గత ఏడాది ఆగస్టు 18వ తేదీన చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ప్రారంభంలో కొన్నాళ్ల పాటు పనులు చురుగ్గా జరగడంతో నిర్ణీత సమయంలో రోడ్డు పనులు పూర్తి కాగలవని బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన ప్రజలు ఆశించారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా కేబీ రోడ్డు నుంచి పెదమదీనా, గున్నెంపూడి హైస్కూల్ వరకు ఉన్న రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో పెకిలించారు. రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న మట్టి బెర్మ్ పనులను నెల రోజుల్లో పూర్తి చేసిన సదరు కాంట్రాక్టర్ ఆకస్మాత్తుగా పనులను మూడు నెలల కాలం నిలిపివేశారు. దీంతో రోడ్డును పెకలించడం వలన తేలిన రాళ్లపై ప్రయాణం నరక ప్రాయంగా మారిందని రెండు మండలాలకు చెందిన ప్రజలు ఆందోళనలు చేపట్టారు. దీనిపై దిగివచ్చిన అధికారులు నవంబరు నెలలో కేబీ రోడ్డు నుంచి పెదమదీనా వరకు వెట్‌మిక్స్ వేసి, మళ్లీ పనులను అర్ధాంతరంగా నిలిపివేసి మూడు నెలలు కావస్తుంది. పెదమదీనా నుంచి గున్నెంపూడి వరకు వెట్‌మిక్స్ వేయకపోవడంతో రాళ్లు తేలిపోయాయి. అలాగే కేబీ రోడ్డు నుంచి పెదదీనా వరకు వేసిన వెట్‌మిక్స్‌లో మెటల్ కూడి లేచిపోయింది. దీంతో ఆర్ఈసీ రోడ్డుపై ప్రయాణాలు మరింత కష్టంగా మారిందని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది నెలల క్రితం ప్రారంభమైన ఈ పనులు తరుచూ నిలిపివేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తేలిపోయిన రాళ్లపై నుంచి ప్రయాణాలు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. ఇటు వంటి రోడ్డుపై రాకపోకలు చేస్తుండడం వల్ల వాహనాలు పాడవుతున్నాయని ఆయా యజమానులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కేబీ రోడ్డు నుంచి ఆర్ఈసీ రోడ్డు వయా పెదమదీన, గున్నెంపూడి రోడ్డును సత్వరమే పూర్తి చేయాలని అంతా కోరుతున్నారు.

అర్లలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

- లోసింగిలో గిరిజనులు వినూత్న రీతిలో ఆందోళన
- 13 కి.మీ. దూరం వెళ్లి ఓటు వేయడం కష్టమని ఆవేదన



లోసింగిలో డోలీతో ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు

రోలుగుంట, ఏప్రిల్ 13: కొత్త పంచాయతీ అర్ల గ్రామంలోనే తాము ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని లోసింగిలో గిరిజనులు శనివారం డోలీతో ఆందోళన చేపట్టారు. అర్ల పంచాయతీ పరిధిలోని కొండ శిఖర గ్రామాలైన పిత్రిగెడ్డ, నీలబంద, పెదగవురు, గదబపాలెం, పాత లోసింగి తదితర గిరిజన గ్రామాలు పాత పంచాయతీ శరభవరంలో ఉండేవని, 2019 ఎన్నికల్లో పదిహేను కిలోమీటర్లు దూరం నడుచుకుని అక్కడికి వెళ్లి ఓట్లు వేశామన్నారు. కొత్తగా 2020లో అర్ల గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలు కూడా ఇక్కడే జరిగాయన్నారు. ప్రస్తుత ఓట్లు పాత పంచాయతీ కేంద్రంలోనే ఉన్నాయని, దీనివలన 15 కిలోమీటర్లు దూరం వెళ్లి వేయాల్సి వస్తుందని వాపోయారు. ఈ కారణంగా పలువురు ఓట్లు వేసేందుకు దూరమవుతున్నట్టు తెలిపారు. అంతేకాకుండా సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నూతన పంచాయతీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు ఉన్నందున అర్ల గ్రామంలోనే తమకు ఓటు వేసే అవకాశాన్ని కల్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పాంగి శాంతి, కిల్లో రుక్మ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో సాధారణ ఓపీకి ఆధార్ తప్పనిసరి

- ప్రతి రోగికి హెల్త్ ఐడీ నెంబరు
- ఓపీ రాయించుకునేవారు ఆధార్ జెరాక్స్ ఇవ్వాలి
- రోగి పేరు మీద ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు



ఏరియా ఆస్పత్రిలో ఓపీ రాయించుకుంటున్న రోగులు

నర్సీపట్నం, ఏప్రిల్ 13 : నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలోని జనరల్ ఓపీ విభాగానికి వచ్చే రోగులు తప్పని సరిగా ఆధార్ జెరాక్స్ తెచ్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ రోగులకు మాత్రమే ఆధార్ అవసరమయ్యేది. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి హెల్త్ ఐడీ ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో జనరల్ ఓపీకి వచ్చే రోగులు ఆధార్ జెరాక్స్ అందజేసి పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. గత ఏడాది మే నెల నుంచే ఈ ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు వచ్చినప్పటికీ రోగులు ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని ఆధార్ అడగడం లేదు. ఇప్పుడు ఉన్నతాధికారులు జనరల్ ఓపీకి ఆధార్ తప్పనిసరి చేశారు. ఏరియా ఆస్పత్రికి వెళ్లే రోగులు తప్పని సరిగా ఆధార్ జెరాక్స్ కూడా పట్టుకొని వెళ్లాలి. ఆధార్‌తో రోగి పేరును హెల్త్ రిజిస్ట్రేషన్ చేసి హెల్త్ ఐడీ ఇస్తారు. రోగిని పరీక్షించే డాక్టరు పేరు, రక్త పరీక్షలు, మందుల వివరాలు అందులో నమోదు చేస్తారు. దీనినే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు అంటారు. ఫిబ్రవరి, మార్చి నెలలో సుమారు రెండు వేల మందికి హెల్త్ ఐడీలు ఇచ్చినట్టు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి తెలిపారు. హెల్త్ ఐడీ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కదానికి రూ.40 చొప్పున ప్రోత్సాహక నగుదు ఇస్తుంది. పేషెంట్ కూడా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు (ఈహెచ్ఆర్) వలన చాలా ఉపయోగాలు ఉన్నాయి. రోగి ఇతర ఆస్పత్రులకు వెళ్లినప్పుడు హెల్త్ ఐడీ ఉంటే సులభతరం అవుతుంది. ఏ డాక్టర్ తనిఖీ చేశారు ? ఏ పరీక్షలు చేశారు ? ఏ మందులు వాడారన్నది తెలుస్తుంది. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రి సేవలు పారదర్శకంగా జరుగుతాయి.

పట్టపగలు కిడ్నాప్

- పోలీసులు ఉరుకులు పరుగులు
- గంటల వ్యవధిలో కిడ్నాపైన వ్యక్తి గుర్తింపు
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివాహేతర సంబంధమే కారణం?

ఎం.వి.పి.కాలనీ, ఏప్రిల్ 13: నగరంలో రద్దీగా ఉండే బీచ్‌రోడ్డులో శనివారం మధ్యాహ్నం అందరూ చూస్తుండగా కిడ్నాప్ జరగడం కలకలం సృష్టించింది. కామత్ హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై వాచీలు విక్రయిస్తుంటారు. అక్కడ సిల్వర్ కలర్ ఇండికా కారులో నుంచి ఓ వ్యక్తి దిగి వాచీలు చూస్తున్నారు. ఈలోగా ఆ కారు వెనుకే మరో కారు(స్విఫ్ట్ డిజైర్)లో వచ్చిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు...వాచీలు చూస్తున్న వ్యక్తిని బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకుని అక్కడి నుంచి తీసుకుపోయారు. వాచీలు అమ్మే వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. కిడ్నాప్ అయిన వ్యక్తి ఎక్కిన కారు డ్రైవర్ ఎం.వి.పి. స్టేషన్‌కు వెళ్లి కారులో ఉండిపోయిన ల్యాప్‌టాప్, సెల్ ఫోన్‌ను అప్పగించాడు. రుషికొండ రాడిసన్ బ్లూ వద్దకు వెళ్లడానికి సంపత్ వినాయక ఆలయం వద్ద కారు ఎక్కినట్టు డ్రైవర్ పేర్కొన్నాడు. దీంతో పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఎట్టకేలకు సదరు వ్యక్తిని పోలీసులు పట్టుకోగలిగినా, ముందు కిడ్నాప్, బంగారం దోచుకున్నారు అని చెప్పిన వ్యక్తి...ఆ తర్వాత అబ్బే అలాంటిదేమీ లేదన్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం...శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన వ్యక్తికి విశాఖలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆమెను కలవడానికి శనివారం విశాఖ వచ్చాడు. మహిళ తాలూకా మనుషులు ఈ విషయం తెలుసుకుని, సంపత్ వినాయక్ ఆలయం నుంచి అతడిని వెంబడించారు. బీచ్‌రోడ్డులోని కామత్ హోటల్ వద్ద ఆగి వాచీలు చూస్తుండగా కిడ్నాప్ చేసి, అప్పుఘర్ వైపు తీసుకుపోయారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాచీలు అమ్ముకునే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు.

రంగంలోకి దిగిన పోలీసులు కిడ్నాప్ కాబడిన వ్యక్తిని, నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ముందు తనను కిడ్నాప్ చేశారని, తన వద్ద ఉన్న బంగారం దోచుకున్నారని చెప్పిన వ్యక్తి, ఆ తర్వాత ప్లేటు మార్చాడు. అతడి వద్ద ఉన్న బంగారం సైతం రోల్డుగోల్డుదేనని పోలీసులు గుర్తించారు. వివాహేతర సంబంధం బయట పడుతుందనే కారణంతో ఫిర్యాదు చేసేందుకు వెనుకాడినట్టు తెలిసింది. దీంతో ఏం చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టుకున్నారు. అయితే ఈ విషయం సంచలనంగా మారడంతో మహిళ భర్తతో పాటు మరో నలుగురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు ఎం.వి.పి.కాలనీ ఎస్.ఐ.శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలావుండగా ఆరిలోవ స్టేషన్ పరిధిలో శ్రీకృష్ణాపురం వద్ద జరిగిన ఓ యువకుడి హత్య చేసిన కేసులో సైతం వివాహేతర సంబంధం కారణంగా ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు తెలిసింది.

కృష్ణాదేవి పేట అల్లూరి పార్కులో నీటి సమస్య

- మోటార్‌కు అందని విద్యుత్ సరఫరా
- పర్యాటకులకు ఇబ్బందులు
- ఎండలకు ఎండుతున్న మొక్కలు



నీరులేక పార్కులో ఎండుతున్న మొక్కలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 13 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు పార్కులో మొక్కలు ఎండకు ఎండుతున్నాయి. వారం రోజుల క్రితం ఇక్కడి మోటర్‌కు విద్యుత్‌ను సరఫరా చేసే త్రీఫేజ్ వైర్లు పాడవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీనిపై సదరు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అంటున్నారు. దీంతో పార్కులో అందమైన మొక్కలు నీరు లేక ఎండిపోతుండగా, ఇక్కడికి వచ్చే పర్యాటకులు సైతం తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్నాళ్ల పాటు ఇదే పరిస్థితి ఉంటే పార్కులో పచ్చదనం పాడై కళావిహీనంగా మారే ప్రమాదం ఉందని పర్యాటకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఇక్కడి సమస్యపై స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు

- జిల్లా ఎస్పీ కేవీ కృష్ణమూర్తి హెచ్చరిక
- పాయకరావుపేట పోలీస్ చెక్‌పోస్టు తనిఖీ



పాయకరావుపేట చెక్‌పోస్టు వద్ద సీఐకి సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

పాయకరావుపేట, ఏప్రిల్ 13: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలో తాండవ షుగర్స్ వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన తనిఖీచేశారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ తదితర అంశాలపై సీఐ పి.అప్పలరాజుతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను మభ్యపెట్టెందుకు డబ్బు, మద్యం, ఉచిత కానుకలు తరలించే అవకాశం ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. అంతకుముందు జిల్లా ఎస్పీ నాతవరం మండలం గన్నవరం మెట్టు పోలీస్ చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు తదితరులున్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

- డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్



పాయకరావుపేటలో సమావేశమైన డీబీపీ రాష్ట్ర నాయకులు

పాయకరావుపేట, ఏప్రిల్ 13: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో దళిత బహుజన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రకటించారు. శనివారం స్థానిక డీబీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ రాష్ట్ర నాయకుల సమావేశంలో కృష్ణస్వరూప్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మాఫియా దోపిడీ పార్టీలను ఓడించాలన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో డీబీపీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీబీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బి.రమేష్, రాయపాటి శామ్యూల్, జాన్ ధర్మరాజు, దువ్వాడ దావీదు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఉపమాక క్షేత్రం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి, ఏప్రిల్ 13: మండలంలోని ఉపమాక వేంకటేశ్వర స్వామి క్షేత్రానికి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద సంఖ్యల భక్తులు తరలివచ్చారు. కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. కింద ఆలయంలో వున్న ఉభయదేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడిని పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించారు. ఆలయంలోని క్యూ లైన్లనీ భక్తులతో నిండిపోయాయి. ప్రత్యేక హోమాలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పవన్, చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి

అచ్యుతాపురం, ఏప్రిల్ 13: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల పర్యటనను విజయవంతం చేయాలని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం సాయంత్రం ఇక్కడ జరిగిన నియోజకవర్గ స్థాయి జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురంలో సభాస్థలాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. ఆరోజు సాయంత్రం ఐదు గంటలకు జరిగే సమావేశానికి కూటమి పార్టీల శ్రేణులు హాజరుకావాలని కోరారు. ఈనెల 18న తాను నామినేషన్ వేస్తున్నానని, ఉమ్మడి పార్టీల శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేష్, రాజాన సన్యాసినాయుడు, డ్రీమ్స్ నాయుడు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు : సీఐ బుచ్చిరాజు



అచ్యుతాపురం జంక్షన్‌లో దుకాణాలు తొలగిస్తున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం, ఏప్రిల్ 13: అచ్యుతాపురం కూడలిలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని సీఐ బుచ్చిరాజు తెలిపారు. శనివారం కూడలిలో రోడ్డు పక్కనున్న దుకాణాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. సెజ్ కారణంగా అచ్యుతాపురంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. వాహన రాకపోకలకు అనువుగా రోడ్డు విస్తరణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకు రోడ్డుతోపాటు తోపుడు బళ్లు, చిన్నచిన్న దుకాణాలు రోడ్డుపై ఉండడంతో ట్రాఫిక్‌కి ఇబ్బంది కలుగుతోంది. అందువల్ల వీటిని అనువైన చోటుకు తరలించే కార్యక్రమం ప్రారంభించామన్నారు. పంచాయతీ అధికారుల సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

తుమ్మపాల, ఏప్రిల్ 13 : ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఎన్డీయే కూటమి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చోడవరంలో జీఎస్టీ అధికారులపై సీఎం రమేశ్ వ్యవహరించిన తీరు, ఎన్నికల ప్రచారాల్లో అడ్డగోలు విధానాలు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా సీతారాముల పెండ్లిరాట



పాల్తేరులో శ్రీరాముని ఆలయం వద్ద పెండ్లి రాట వేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని పాల్తేరు, సత్యవరం, గోపాలపట్నం, మంగవరం, కుమారపురం, తదితర గ్రామాలలో శ్రీరామ నవమినాడు సీతారాముల కల్యాణానికి శనివారం పెండ్లి రాటలు వేశారు. పాల్తేరులో హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పెండ్లిరాటను వేశారు. ఆరోజు అన్న సమారాధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవవరపు వెంకట్రావు, దేవవరపు రాజుబాబు, కొంకిపూడి మూలయ్య, దేవవరపు రాము, శ్రీనివాసరావు, వార్డుమెంబరు దేవవరపు బుజ్జి, మహిళలు పాల్గొన్నారు.

పరవాడలో.. ఈనెల 17న నిర్వహించనున్న శ్రీరామ నవమి పండగ సందర్భంగా పరవాడ రామాలయం వద్ద శనివారం సీతారాముల కల్యాణం పందిర రాటను వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు దంపతులతోపాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉపసర్పంచ్ బండారు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా పోతునాయుడు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. మునిసిపాలిటీ పెదపల్లి వార్డులో శనివారం సీతారాముల పెండ్లి రాట ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా భక్తులు దాసరి కుమార్, చిన్నమ్మలు దంపతుల సమక్షంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలంతా కలిసి పెండ్లిరాట ఉత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు

రాంబిల్లి, ఏప్రిల్ 13: మండంలోని హరిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం అచ్యుతాపురం మండలం గొర్లిధర్మవరానికి చెందిన వైసీపీ నాయకులు గొర్లె నాగేశ్వరరావు, గొర్లె అప్పలరాజు, గొర్లె శ్రీనివాసరావుతోపాటు 20 కుటుంబాలు వారు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు బైలపూడి రామదాసు, డ్రీమ్స్ నాయుడు, రాజాన విజయ్, జి.చిరంజీవి పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో భోజన పంపిణీకి బ్రేక్!

... 5వ పేజీ తరువాయి

అల్పాహారం, రెండు పూటలా మెనూ ప్రకారం భోజనం పెట్టేందుకు కాంట్రాక్టరుకు ప్రభుత్వం రూ.80 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ప్రతిరోజు 150 మంది రోగులకు భోజనం పెడుతున్నారు. ఇక్కడ సుమారు రూ.18 లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. బిల్లులు అప్‌లోడ్ చేయడం మాత్రమే మా పనని, చెల్లింపులతో సంబంధం ఉండదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో భోజనం సరఫరా చేసే కాంట్రాక్టర్లకు సుమారు రూ.1.8 కోట్లు అప్‌లోడ్ చేనసినా, బిల్లుల టోకెన్ జారీ అయిన తరువాత కూడా చెల్లింపులు జరగలేదని సమాచారం. ఈ నేపథ్యంలో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన తమకు బకాయిలు చెల్లించకపోతే ఎలా అంటూ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు నిలిచిపోవడంతో రోగులకు మెనూ ప్రకారం భోజన ఏర్పాట్లు చేయలేకపోతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాని కోరుతున్నారు. ఈ విషయమై అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రతినెలా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. కాగా భోజనం పంపిణీ నిలిపేస్తామంటూ కాంట్రాక్టర్లు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. బిల్లుల పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తాము కూడా కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

భగ్గుమన్న భానుడు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రాంబిల్లి పోలీస్ స్టేషన్ జంక్షన్



జనసందడి లేని అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం రోడ్డు

- వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- బయటకు రావడానికి భయపడుతున్న జనం
- నిర్మానుష్యంగా ప్రధాన రోడ్లు, జంక్షన్లు

రాంబిల్లి, ఏప్రిల్ 13 : సూర్యుడు తన ఉగ్రరూపాన్ని దాల్చడంతో గ్రామాల్లో ప్రజలు హడలిపోతున్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. దీంతో ప్రజలు 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు సాహసించలేదు. ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. చంటి పిల్లలు, బాలింతలు, వృద్ధులు అల్లాడిపోయారు. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే పోలీస్ స్టేషన్, వెంకటాపురం జంక్షన్లు, రోడ్లు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఎండ వేడిమికి పశువుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీనివల్ల పాల దిగుబడి కూడా తగ్గిపోతుందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఇలాగే ఉంటే మరింత ఇబ్బందులు పడతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మండుతున్న ఎండలు

అనకాపల్లి టౌన్ : పట్టణంలో ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గినా శనివారం మళ్లీ పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురు, శుక్రవారాలు అత్యధిక ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలు ఉండగా శనివారం అత్యధిక ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు నమోదైంది. అత్యల్ప ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే వడగాడ్పులు వీస్తున్నాయి. ఆపై ఉక్కపోతతో ప్రజలు అల్లాడిఇపోతున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లికి వివిధ పనులపై వచ్చే గ్రామీణులు ఈ ఉష్ణోగ్రతలకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో శీతల పానీయాల కేంద్రాల వద్ద రద్దీగా ఉంటుంది. మధ్యాహ్నం ఒంటిగంటకే పట్టణంలోని పలు రహదారుల్లో జనసందడి ఎక్కడా కనిపించలేదు. సాయంత్రం నాలుగు గంటలు దాటినా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్న ఈవీఎంలు

ఎలమంచిలి, ఏప్రిల్ 13 : సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లకు శనివారం చేరుకున్నాయి. ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు తదితర సామగ్రి ప్రత్యేక వాహనంలో పోలీస్ భద్రతతో చేరుకున్నాయి. రిటర్నింగ్ అధికారి మనోరమ, ఏఈఓలు, పట్టణ ఎస్ఐలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీటిని పరిశీలించారు. ప్రత్యేక వాహనంలో వచ్చిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. నియోజకవర్గంలోని 246 పోలింగ్ స్టేషన్‌లకు 246 ఈవీఎంలతోపాటు అదనంగా మరో 20 శాతం ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్నట్టు ఆర్‌వో మనోరమ తెలిపారు. సుమారు రెండు గంటల పాటు పరిశీలించిన అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు మాత్రమే వచ్చాయని, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు రానున్నాయని తెలిపారు.



ఎలమంచిలి డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న ఈవీఎం, వీవీ ప్యాడ్‌లు



నక్కపల్లిలో స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలను తీసుకువెళుతున్న అధికారులు

నక్కపల్లిలో..

సార్వత్రిక ఎన్నికలకు పాయకరావుపేట నియోజకవర్గానికి అవసరమైన ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య శనివారం సాయంత్రం నక్కపల్లికి తీసుకువచ్చారు. ప్రత్యేక వాహనంలో 350 ఈవీఎంలు, 350 వీవీ ప్యాడ్లు చేరుకున్నాయి. నక్కపల్లి జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో ఆర్వో కె.గీతాంజలి, రాజకీయ నాయకులు సమక్షంలో వీటిని భద్రపరిచారు. రౌండ్ ది క్లాక్ స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ బందోబస్తు వుంటుందని సీఐ విజయ్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైనులు, హెచ్‌డీటీ సత్యనారాయణ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 : స్థానిక లక్ష్మీదేవిపేట ప్రాథమిక స్కూల్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం జరిగింది. స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ మామిడి నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఏపీఈపీడీసీఎల్ ఏఈ మైలపల్లి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధి పెనమటి అప్పారావు, పడాల మోహన్, స్కూల్ హెచ్ఎం రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో.. స్థానిక బీసీ వసతిగృహంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతిని వార్డెన్ పి.నారాయణరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే రికార్డు ఆఫీసర్ ఉడిగల నరసింగరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఎంఈవో నంబా రమణ, శివలంక జగ్గారావు, పావాడ సన్యాసిరావు, కారు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగన్‌ను గద్దె దించాలి

- ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నకేశవులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 : దళితుల మాన ప్రాణాలతో ఆటలాడుకుంటున్న సీఎం జగన్‌ను గద్దెదించాలని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు కోరారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్లలో దళితులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ వచ్చారన్నారు. సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ఒక దళిత యువకుడు రెండు మామిడికాయలు దొంగలించారనే నెపంతో అత్యంత కిరాతకంగా హింసించి చంపారని ఆరోపించారు. అలాగే మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను కూడా హింసించారన్నారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో 28 మంది దళితులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ అనంతబాబు తన వద్ద పనిచేసిన కారు డ్రైవర్‌ను చంపి శవాన్ని ఇంటికి తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించి నీ దిక్కువారితో చెప్పుకోమని హెచ్చరించారంటే వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు స్పష్టమౌతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు ఇచ్చి మద్యం పేరుతో ఆ డబ్బులు కంటే ఎక్కువగా ప్రభుత్వం దోచేస్తుందని విమర్శించారు. అనకాపల్లి నుంచి ఫ్రంట్ తరుపున కనిశెట్టి సురేష్‌బాబు, పాయకరావుపేట నుంచి పరవాడ రామకృష్ణ, మాడుగుల నుంచి ఎం. లోవచంద్ బరిలోకి దిగుతున్నారని ఆయన వివరించారు. సమావేశంలో నాయకులు రాజారావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చెన్నకేశవులు

వలస కార్మికులకు వసతులు కల్పించాలి

పరవాడ, ఏప్రిల్ 13 : ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి రాంకీ ఎస్ఈజెడ్, ఫార్మాసిటీల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు సరైన వసతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం రాంకీ ఎస్ఈజెడ్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన 150 మంది కార్మికులు, మహిళలు, చిన్నారులు ఏ విధమైన సౌకర్యాలు లేకుండా తాత్కాలిక గుడారాల్లో నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించలేదన్నారు. కార్మిక శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

నేడు చంద్రబాబు ప్రజాగళం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరి 5.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 5.20 గంటలకు రోడ్డు మార్గాన పాతగాజువాకకు 5.35 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం ఆరు నుంచి 7.30 గంటల వరకు ఎన్నికల సభలో పాల్గొంటారు. అనంతరం 7.40 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, రాత్రి ఎనిమిది గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళతారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత తొలిసారిగా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర పర్యటనకు వస్తున్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, చోడవరం, గాజువాక సభలకు తొలుత ఏర్పాట్లుచేశారు. అయితే ఒకేరోజు మూడుచోట్ల సభలు నిర్వహణ సాధ్యంకాదని పాయకరావుపేట, గాజువాకలను ఖరారుచేశారు. అయితే ఈనెల 16వ తేదీన అనకాపల్లి జిల్లా చోడవరం, ఎలమంచిలిలో చంద్రబాబునాయుడు,జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సభల్లో పాల్గొననున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.

నేడు మూల స్వయంభూవరంలో గ్రామస్థుల ఆందోళన

పరవాడ, ఏప్రిల్ 13 : కలపాక పంచాయతీ పరిధి మూల స్వయంభూవరం గ్రామస్థులు సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యాన్ని నిరసిస్తూ ఆదివారం ఉదయం పది గంటలకు ఆందోళన చేపట్టనున్నారు. సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన చిమ్మిల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా గ్రామంలో పంటలు దెబ్బతినడంతోపాటు అనారోగ్యాల మిరిన పడుతున్నారని స్థానిక యువకులు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థులమంతా కలిసి ఆందోళన చేయడానికి నిర్ణయించుకున్నట్టు వారు వెల్లడించారు.

'ఉపాధి'కి నీడ కరవు

... 5వ పేజీ తరువాయి



గుడివాడ వియ్యపువాని చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న కూలీలు

కనిపించడంలేదు. దీంతో పాటు ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూమిలో ఏమాత్రం పదును లేకుండా పోయిందని, ఈ నేపథ్యంలో నేల గట్టిపడి పనులు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలపైనా అనుమానమే...

పదును లేక పనులు సాఫీగా సాగకపోవడంతో వేతనాలు కూడా తక్కువగా వచ్చే అవకాశముందని కూలీలు వాపోతున్నారు. మండుటెండలో పనులు సాగిస్తున్నా గిట్టుబాటు కూలీ దక్కదనే ఆందోళన వారిలో కనిపిస్తోంది. గతంలో మాదిరిగా చేసిన పనికి ప్లేసిప్లు ఇవ్వాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఉపాధిహామీ పథకం ఏపీవో కాశీని వివరణ కోరగా పని ప్రదేశాల్లో నీడ కల్పించేందుకు టార్పాలిన్లు లేకపోవడం వాస్తవమేనన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం కోసం ఆలోచిస్తున్నామన్నారు. తాగునీటి వసతి కూడా కల్పిస్తామన్నారు. ఫస్టుఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఎండలు పెరిగిపోవడంతో పనులు త్వరగా ముగించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మార్చి వరకూ మండలానికి రూ1.2 కోట్ల మేర ఉపాధి వేతనాలు కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు.

నాలుగు వారాల కూలి ఇంకా రావాలి



పూడక తీత పనులు చేస్తున్నాం. నాలుగు వారాల కూలి డబ్బులు బ్యాంకులో పడ్డాయంటున్నారు. బ్యాంకుకు వెళ్తే ఇంకా రాలేదంటున్నారు. పని ప్రదేశంలో టార్పాలిన్లు లేకపోవడంతో ఎండను తట్టుకోలేకపోతున్నాం. సేదదీరే మార్గం లేకుండా పోయింది. తాగునీరు కూడా లేకపోవడంతో ఇంటి నుంచి సీసాలతో నీరు తెచ్చుకుంటున్నాం.

- మేడిబోయిన కుమారి,
ఉపాధి కూలీ, గుడివాడ.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

కొత్తూరు, ఏప్రిల్ 13: అనకాపల్లి మండలంలోని సీతానగరం, తగరంపూడి, మెట్టపాలెం, జగన్నాథపురం, వెంకుపాలెం గ్రామాల నుంచి 100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం జనసేన పార్టీలోకి చేరారు. సీతానగరానికి చెందిన గంగుపాం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

- జడ్‌పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని



లాలంకోడూరులో ప్రచారం చేస్తున్న లాలం భవాని

రాంబిల్లి, ఏప్రిల్ 13 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, ఎలమంచిలి జనసేన అభ్యర్థి విజయకుమార్‌లను గెలిపించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని కోరారు. శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి లాలంకోడూరు లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్‌కు గ్లాసు గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు లాలం చందు, డీఎస్ఎన్ రాజు, సత్యప్రసాద్, లాలం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం ఫైరాఫీసర్‌గా సత్యరాజు



సబ్బవరం, ఏప్రిల్ 13 : సబ్బవరం ఫైరాఫీసర్‌గా జీవీ సత్యరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఫైరాఫీసర్ దిలీప్‌కుమార్ విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ జరగనున్న అగ్నిమాపక వారోత్సవాలు ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా లలితాంబిక కల్యాణి హోమం



లలితాంబిక మాతకు పూజలు చేస్తున్న భక్తులు

సబ్బవరం, ఏప్రిల్ 13: మండలంలోని దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శనివారం లలిత సహిత స్వయంవర కల్యాణి హోమం గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పంచదశి మంత్రజపం, అభిషేకం, లలితా హోమం, కళావాహన పూజలు నిర్వహించారు. శ్రీవిద్యాట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు కందర్పం రమా, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

16న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

లంకెలపాలెం, ఏప్రిల్ 13: పెదముషిడివాడ 33/11 కేవీ సబ్ స్టేషన్ వద్ద ఈనెల 16న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ తెలిపారు. వినియోగదారుల సమస్యలపై ఈ వేదికలో చర్చించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈవేదికకు విశ్రాంతి న్యాయమూర్తి కస్టమర్ గ్రీవెన్స్ రెసిడెన్షియల్ ఫోరం చైర్మన్ బి. సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీరామ నామంతో మార్మోగిన రామాలయం



కొత్తపేట సీతారాముల ఆలయంలో ఏకాహం చేస్తున్న భక్తులు

ఎలమంచిలి, ఏప్రిల్ 13: పట్టణంలోని కొత్తపేట సీతారాముల ఆలయ ఆవరణ శనివారం శ్రీరామ నామంతో మార్మోగిపోయింది. వసంత నవరాత్రులలో భాగంగా శనివారం నిర్వహించిన ఏకాహం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తి భజనలు ఆలపిస్తూ శ్రీరామ నామాన్ని జపించారు.

గుడారాలను సందర్శించిన కార్మిక శాఖ అధికారిణి

- కార్మికుల నుంచి వివరాలు సేకరణ
- వసతులపై ఆరా తీసిన ఏడీసీ రమ్య



కార్మికుల నుంచి వివరాలు సేకరిస్తున్న కార్మిక శాఖ అధికారిణి రమ్య

పరవాడ, ఏప్రిల్ 13 : రాంకీ ఎస్ఈజెడ్‌లోని వలస కార్మికుల కోసం ఏర్పాటు చేసిన గుడారాలను శనివారం సాయంత్రం కార్మిక శాఖ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.రమ్య సందర్శించారు. అక్కడ ఎంతమంది కార్మికులు నివాసం ఉంటున్నారు.. ఎంతకాలం నుంచి ఉంటున్నారు.. కాంట్రాక్టర్ ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.. తదితర వివరాలను సేకరించారు. సుమారు 20 గుడారాలు ఉన్నట్టు గుర్తించారు. అలాగే కార్మికులకు పూర్తిస్థాయిలో వసతి కల్పించలేదన్న విషయాన్ని కూడా తాము గుర్తించినట్టు ఆమె విలేకరులకు తెలిపారు. వలస కార్మికులు పడుతున్న అవస్థలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వివరించారు. వారికి తొందరలోనే పూర్తిస్థాయిలో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

దళిత వాడలను నేతలు దత్తత తీసుకోవాలి

తుమ్మపాల, ఏప్రిల్ 13 : దళితవాడలను నాయకులు దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని దళితసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేష్ కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాలను శనివారం పట్టణంలోని దళిత సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా దళితులకు సౌకర్యాలు, రాయితీలను ప్రభుత్వాలు అందించాలని కోరారు. అనకాపల్లిలో అంబేడ్కర్ భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రేబాక మధుబాబు, కొత్తపల్లి శ్రీనివాసరావు, చెక్కా రాంబాబు, మైలపల్లి పోతురాజు, బొడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లింగంపేటలో ఘనంగా నూకాలమ్మ జాతర


భక్తుల పూజలందుకుంటున్న అమ్మవారు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 13 : గొలుగొండ మండలం లింగంపేటలో నూకాలమ్మ జాతర అత్యంత ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఆరో రోజైన శనివారం అమ్మ వారి దర్శనానికి నర్సీపట్నం, నాతవరం, కొయ్యూరు, గొలుగొండ, మాకవరపాలెం తదితర మండలాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తుల భారీగా తరలి వచ్చారు. దీంతో ఎటు చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఒమ్మవరంలో భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న భక్తులు

రావికమతం, ఏప్రిల్ 13 : ఒమ్మవరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, వినాక, లక్ష్మీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. జీర్ణోద్ధారణకు గురైన ఆలయాన్ని పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో సర్పంచ్ తోట సంజీబు, గ్రామస్థులు సంయుక్తంగా ఆలయాన్ని నిర్మించారు.

నేడు చంద్రబాబు ప్రజాగళం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరి 5.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 5.20 గంటలకు రోడ్డుమార్గాన పాతగాజువాకకు 5.35 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం ఆరు నుంచి 7.30 గంటల వరకు ఎన్నికల సభలో పాల్గొంటారు. అనంతరం 7.40 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, రాత్రి ఎనిమిది గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళతారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత తొలిసారిగా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర పర్యటనకు వస్తున్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, చోడవరం, గాజువాక సభలకు తొలుత ఏర్పాట్లుచేశారు. అయితే ఒకేరోజు మూడుచోట్ల సభలు నిర్వహణ సాధ్యంకాదని పాయకరావుపేట, గాజువాకలను ఖరారుచేశారు. అయితే ఈనెల 16వ తేదీన అనకాపల్లి జిల్లా చోడవరం, ఎలమంచిలిలో చంద్రబాబునాయుడుతోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల సభల్లో పాల్గొననున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.

ఆస్పత్రుల్లో భోజన పంపిణీకి బ్రేక్!

... 5వ పేజీ తరువాయి

అల్పాహారం, రెండు పూటలా మెనూ ప్రకారం భోజనం పెట్టేందుకు కాంట్రాక్టరుకు ప్రభుత్వం రూ.80 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ప్రతి రోజు 150 మంది రోగులకు భోజనం పెడుతున్నారు. ఇక్కడ సుమారు రూ.18 లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. బిల్లులు అప్‌లోడ్ చేయడం మాత్రమే మా పనని, చెల్లింపులతో సంబంధం ఉండదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో భోజనం సరఫరా చేసే కాంట్రాక్టర్లకు సుమారు రూ.1.8 కోట్లు అప్‌లోడ్ చేనసినా, బిల్లుల టోకెన్ జారీ అయిన తరువాత కూడా చెల్లింపులు జరగలేదని సమాచారం. ఈ నేపథ్యంలో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన తమకు బకాయిలు చెల్లించకపోతే ఎలా అంటూ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు నిలిచిపోవడంతో రోగులకు మెనూ ప్రకారం భోజన ఏర్పాట్లు చేయలేకపోతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాని కోరుతున్నారు. ఈ విషయమై అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రతినెలా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. కాగా భోజనం పంపిణీ నిలిపేస్తామంటూ కాంట్రాక్టర్లు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. బిల్లుల పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తాము కూడా కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

'ఉపాధి'కి నీడ కరవు


మండుటెండలో కొమిర రామరాజు చెరువులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

... 5వ పేజీ తరువాయి

కనిపించడంలేఏదు. దీంతో పాటు ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూమిలో ఏమాత్రం పదును లేకుండా పోయిందని, ఈ నేపథ్యంలో నేల గట్టిపడి పనులు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలపైనా అనుమానమే...

పదును లేక పనులు సాఫీగా సాగకపోవడంతో వేతనాలు కూడా తక్కువగా వచ్చే అవకాశముందని కూలీలు వాపోతున్నారు. మండుటెండలో పనులు సాగిస్తున్నా గిట్టుబాటు కూలీ దక్కదనే ఆందోళన వారిలో కనిపిస్తోంది. గతంలో మాదిరిగా చేసిన పనికి ప్లేసిష్లు ఇవ్వాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఉపాధిహామీ పథకం ఏపీవో కాశీని వివరణ కోరగా పని ప్రదేశాల్లో నీడ కల్పించేందుకు టార్పాలిన్లు లేకపోవడం వాస్తవమేనన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం కోసం ఆలోచిస్తున్నామన్నారు. తాగునీటి వసతి కూడా కల్పిస్తామన్నారు. ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఎండలు పెరిగిపోవడంతో పనులు త్వరగా ముగించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మార్చి వరకూ మండలానికి రూ1.2 కోట్ల మేర ఉపాధి వేతనాలు కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు.

కూలి డబ్బులు రాలేదు



పూడిక తీత పనులు చేస్తున్నాం. నాలుగు వారాల కూలి డబ్బులు బ్యాంకులో పడ్డాయంటున్నారు. బ్యాంకుకు వెళ్తే ఇంకా రాలేదంటున్నారు. పని ప్రదేశంలో టార్పాలిన్లు లేకపోవడంతో ఎండను తట్టుకోలేకపోతున్నాం. సేదదీరే మార్గం లేకుండా పోయింది. తాగునీరు కూడా లేకపోవడంతో ఇంటి నుంచి సీసాలతో నీరు తెచ్చుకుంటున్నాం.

- **మేడిబోయిన కుమారి,** ఉపాధి కూలీ, గుడివాడ.

ఈవీఎంలు వచ్చేశాయ్..

- నియోజకవర్గ కేంద్రాలైన నర్సీపట్నం, చోడవరం, మాడుగుల చేరిక
- వివిధ పార్టీల నాయకుల సమక్షంలో కంటైనర్లు సీజ్ తొలగింపు
- భారీ పోలీస్ బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రం
- నేడో రేపో అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన మెషీన్లు రాక


నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ వద్దకు కంటైనర్‌లో చేరిన ఈవీఎంలు

నర్సీపట్నం, ఏప్రిల్ 13 : పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లు శనివారం నియోజకవర్గ కేంద్రాలకు చేరుకున్నాయి. నర్సీపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో అనకాపల్లి ఎంపీ స్థానానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. మధ్యాహ్నం అనకాపల్లి నుంచి భారీ కంటైనర్‌లో నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాలకు గాను 314 కంట్రోల్ యూనిట్లు, 314 బ్యాలెట్ యూనిట్లు, 340 వీవీ ప్యాట్లు తరలించారు. టీడీపీ, వైసీపీ, బీజేపీల నాయకుల సమక్షంలో కంటైనర్ తలుపులకు ఉన్న సీల్‌ను తొలగించారు. రిటర్నింగ్ ఆఫీసర్ జయరాం, తహసీల్దార్ శ్రీరాములు, సీఐ కాంతికుమార్, పోలీస్ బందోబస్తుతో ఈవీఎంలు ఉన్న ట్రంక్ పెట్టెలను కంటైనర్ నుంచి బయటకు తీసి స్ట్రాంగ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత కోసం సాయుధ పోలీసులను బందోబస్తు ఉంచారు. అసెంబ్లీ స్థానానికి సంబంధించిన ఈవీఎంలు ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయానికి చేరుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఇదిలావుంటే, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెయిన్ గేట్ నుంచి కంటైనర్ లోపలకు రావడానికి నేమ్ బోర్డు అడ్డు తగిలింది. దీంతో గంటన్నర సేపు చింతపల్లి రోడ్డులో ఉంచేయవలసి వచ్చింది. ఆర్వో జయరాం ఆదేశాలతో వెల్డర్‌ను తీసుకొచ్చి మెయిన్ గేటుకు అమర్చిన ఐరన్ ఊచలను కట్ చేయించి నేమ్ బోర్డు తొలగించారు. దీంతో కంటైనర్ కళాశాల ఆవరణ నుంచి వెనక భాగంలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లు వరకు సులభంగా చేరుకోగలిగింది.

చోడవరం : జిల్లా కేంద్రం అనకాపల్లి నుంచి చోడవరం నియోజకవర్గానికి ఈవీఎంలు శనివారం చేరుకున్నాయి. తొలివిడతగా 291 కంట్రోల్ యూనిట్లు, 291 బ్యాలెట్ యూనిట్లు, 315 వీవీ ప్యాట్లు వచ్చాయి. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లోని ఎన్నికల సామగ్రి కేంద్రానికి ఇవి చేరుకున్నాయి.


మాడుగుల చేరుకున్న ఈవీఎంలు

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీప చిన్నికృష్ణ ఆధ్వర్యంలో రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు తీసుకుని వచ్చిన వాహనం సీల్‌ను తొలగించారు. అనంతరం వాటిని గదుల్లో భద్రపరిచారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ మాట్లాడుతూ తొలివిడతలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు వచ్చాయన్నారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు రానున్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి సోమవారం స్థానికంగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు చెప్పారు.

మాడుగుల : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మాడుగుల నియోజకవర్గానికి అవసరమైన ఈవీఎంలు శనివారం రాత్రి మాడుగుల చేరుకున్నాయి. ఎస్ఐ పి.దామోదరనాయుడు పర్యవేక్షణలో సిబ్బంది ఎస్కాట్‌తో ఇక్కడి ఆర్‌సీఎం పాఠశాలకు వీటిని చేర్చారు. దీంతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ జీవీ సత్యవాణి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో కంటైనర్ సీల్‌ను తొలగించారు. 282 కంట్రోల్ యూనిట్స్ 282 బ్యాలెట్ యూనిట్స్, 305 వీవీ ప్యాట్లు రావడంతో వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎన్నికల డీటీ ఎం.రాజ, సీనియర్ అసిస్టెంట్ వి.పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'జగన్ మహిళలకు క్షమాపణ చెప్పాకే ఓట్లు అడగాలి'


పాపయ్యపాలెం ప్రచార సభలో మాట్లాడుతున్న అయ్యన్న

మాకవరపాలెం, ఏప్రిల్ 13 : సంపూర్ణ మద్యనిషేధం తెస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి, దానిని తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి జగన్ మహిళలకు ముందుగా క్షమాపణ చెప్పి ఎన్నికల్లో ఓట్లు అడగాలని మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. పాపయ్యపాలెంలో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందన్నారు. ఇచ్చిన హామీలను సైతం విస్మరించిన జగన్‌ను ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, జనసేన నాయకుడు సూర్యచంద్ర, బీజేపీ నాయకులు మత్రినాయుడు, తమరాన నాయుడు, టీడీపీ నాయకులు వరహాలు బాబు, సుబ్బలక్ష్మి, రామునాయుడు, గోవింద, చిరంజీవి, జోగిపాత్రుడు పాల్గొన్నారు.

గొలుగొండ : రాష్ట్రాభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కోరారు. ఏటిగైరంపేటలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడుకు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. అయ్యన్న మంత్రిగా ఉన్నప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అనంతరం వైసీపీ నుంచి సొసైటీ మాజీ డైరెక్టర్ కొమ్మిశెట్టి వెంకట్రావు, పోలుపర్తి రాము తదితరులు టీడీపీలో చేరడంతో వారికి కండువాలు కప్పారు. నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, సుర్ల బాబ్జి, నల్లబెల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

'16కు చంద్రబాబు, పవన్ పర్యటన వాయిదా'


సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఏప్రిల్ 13 : నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం చేపట్టాల్సిన పర్యటన ఈనెల 16వ తేదీ మంగళవారం నాటికి వాయిదా పడినట్టు మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యర్తలు సభకు సిద్ధం కావాల్సిందిగా పిలుపునిచ్చారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొననున్న రోడ్డు షోకు సంబంధించి శనివారం సాయంత్రం ఇక్కడి పార్టీ కార్యాలయంలో కూటమి కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, కనిశెట్టి మత్స్యరాజు, బొడ్డేడ గంగాధర్, జనసేన నాయకులు సిరిపురపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

14 మంది వలంటీర్లు రాజీనామా

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 13 : గొలుగొండ మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా లింగంపేటలో ఐదుగురు, కొంగసింగిలో తొమ్మిది మంది శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు సదరు పత్రాలను సచివాలయ ఉద్యోగులకు అందజేశారు.

98 మందికి కంటి పరీక్షలు

దేవరాపల్లి, ఏప్రిల్ 13 : మండలంలోని తిమిరాంలో 98 మందికి శనివారం ఉచితంగా కంటివైద్య పరీక్షలు నిర్వహించినట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో-ఆర్డినేటర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఇందులో నలభై మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించడంతో ఈ మేరకు విశాఖపట్నంలోని ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆర్.సురేష్, సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ, గట్రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

25 కుటుంబాల వారు బీజేపీలో చేరిక


బీజేపీలో చేరినవారితో ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 13 : గొలుగొండ మండ లం పాత కృష్ణాదేవిపేట గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన 25 కుటుంబాలవారు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. వీరికి రమేష్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వైసీపీ నాయకుడు గల్లా నూకరాజుతో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నట్టు బీజేపీ మండల అధ్యక్షుడు చందక గౌరి నాయుడు తెలిపారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట


చీడిగుమ్మల రామాలయం వద్ద రాట వేస్తున్న భక్తులు

గొలుగొండ, ఏప్రిల్ 13 : శ్రీరామ నవమి వేడుకలకు పలు గ్రామాల్లోని ఆలయాల నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా శనివారం పెళ్లి రాటను వేశారు. ఈ నెల 18వ తేదీన ఈ వేడుక జరగనున్న నేపథ్యంలో గొలుగొండ, చీడిగుమ్మల, రావణాపల్లి, గుండుపాల, పాకలపాడు, ఏటిగైరంపేట, కొత్తఎల్లవరం, జోగంపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో రాటోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భీమిరెడ్డి సత్యనారాయణ, కొల్లి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

15న భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తా : గవిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

చీడికాడ, ఏప్రిల్ 13 : ప్రజా సర్వేకు వ్యతిరేకంగా మాడుగుల నియోజకవర్గం టీడీపీ టికెట్టు కేటాయించడం తగదని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. దీనికి అనుగుణంగా సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తురువోలు గ్రామంలో జరిగే నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని వెల్లడించారు. మండలంలోని అప్పలరాజుపురంలో శనివారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న తనకు సీటు కేటాయించకపోవడం తగదన్నారు. ఈ సమావేశంలో జీఎస్ఎన్ ట్రస్టు ఛైర్మన్ గవిరెడ్డి సన్యాసినాయుడు, నాయకులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఆ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం కాదు'

చోడవరం, ఏప్రిల్ 13 : మండలంలోని జన్నవరంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం కాదని చోడవరం ఈపీడీసీఎల్ ఏడీఈ కె.గౌరీ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సదరు గ్రామంలో అగ్ని ప్రమాదం వెనుక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని, ఆ పాకలకు విద్యుత్ కనెక్షన్ కూడా లేదని వివరించారు. ఘటనపై విచారణ జరిపామని, అక్కడ విద్యుత్ కనెక్షన్లు కానీ కరెంటు వైర్లు కానీ లేవని స్పష్టం చేశారు.

మునిసిపల్ ఛైర్‌పర్సన్ కుమారుడు షేర్ మృతి


బోడపాటి షేర్ (ఫైల్)

నర్సీపట్నం, ఏప్రిల్ 13 : నర్సీపట్నం మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పెద్ద కుమారుడు షేర్ (36) శనివారం మృతి చెందారు. ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతుండడంతో ఇరవై రోజులు క్రితం అతనిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలోచేర్పించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. షేర్ మృతికి ఎమ్మెల్యే గణేశ్, వైస్ ఛైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

టీడీపీ బూత్ కన్వీనర్‌కు బెదిరింపుపై ఫిర్యాదు

మాకవరపాలెం, ఏప్రిల్ 13 : మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన టీడీపీ బుత్ కన్వీనర్ అల్లు కన్నబాబుకు వచ్చిన బెదిరింపు కాల్స్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐ రామకృష్ణారావుకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదో తేదీన భూ బకాసూరుడు అనే శీర్షికతో సోషల్ మీడియాలో వార్త వస్తే దానిని టీడీపీ గ్రూపుల్లో అల్లు కన్నబాబు పార్వడ్ చేశారన్నారు. దీంతో బూరుగుపాలెం ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు, తన అనుచరులైన రుత్తల దేముడు, మాకిరెడ్డి అప్పలనాయుడు, బోంతు రమణ, మరో వ్యక్తి వివిధ నంబర్ల ద్వారా ఫోన్ చేసి అల్లు కన్నబాబును బెరించినట్లు ఆరోపించారు. వీరి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని అల్లు కన్నబాబు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిశోర్, మాజీ జడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, టీడీపీ నాయకులు జోగిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు ఆరోపణలపై చర్యలు చేపట్టండి'

ఇదిలావుంటే, తప్పుడు సమాచారాలతో తప్పుడు ఆరోపణలు ప్రచురణ చేసిన ప్రచార సాధనాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బూరుగుపాలెం ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు శనివారం ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై సోషల్ మీడియా ద్వారా పలు గ్రూపుల్లో తప్పుడు సమాచారంతో ఆరోపణలు చేశారన్నారు. దీనివల్ల తన పరువుకు భంగం కలిగించారని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్‌లో మెరిసిన పేదింటి పిల్లలు

చోడవరం, ఏప్రిల్ 13 : ఇంటర్ ఫలితాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురు మంచి మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. చోడవరం శ్రీవిజ్ఞాన్ కళాశాలకు చెందిన ఫస్టియర్ విద్యార్థిని బి.నవ్యశ్రీ 440 మార్కులకు 434 పొందింది. ఈమె తండ్రి రామునాయుడు ఆటోడ్రైవర్. ఇక ఉషోదయ జూనియర్ కళాశాలకు చెందిన ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థిని తమ్మాన లిఖిత 470 మార్కులకు 463 మార్కులు పొందింది. ఇదే కళాశాలకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని టి.భవ్య వెయ్యి మార్కులకు గాను 980 మార్కులు సాధించడం విశేషం. ఈమె తండ్రి రమేష్ కూడా ఆటో డ్రైవర్. కాగా ఉషోదయ కాలేజీకి చెందిన పలువురు విద్యార్థినీ విద్యార్థులు నాలుగు వందల పైబడి మార్కులు సాధించారు. ఇక శ్రీవిజ్ఞాన్ కాలేజీకి చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థులు కూడా అత్యధిక మార్కులు పొందారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను ఉషోదయ కళాశాలల ఛైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, డీన్ వాసు, ప్రిన్సిపాల్ అప్పారావు, శ్రీవిజ్ఞాన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఈర్లె గోవింద్, డైరెక్టర్లు బి.వి.రామకృష్ణ, బి.జి.దామోదర్, వై.శ్రీను అభినందించారు.

ఏంసీఏ చేస్తా..



పేరు : టి.భవ్య
మార్కులు: 980
గ్రూపు : ఎంపీసీ
ఊరు : గవరవరం, చోడవరం మండలం
కళాశాల : ఉషోదయ జూనియర్ కాలేజి, చోడవరం
తండ్రి పేరు : రమేష్. ఆటో డ్రైవర్.
తల్లి పేరు : సుజాత. గృహిణి.
లక్ష్యం : డిగ్రీ చదివి ఎంసీఏ చేయాలని ఉంది.

ఇండియన్ కోస్టల్ ఉద్యోగం



విద్యార్థి పేరు : గంట్ల సాయికుమార్.
కళాశాల : తురకలపూడి, చైతన్య కళాశాల, విశాఖ.
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 463
తల్లిదండ్రులు : గంట్ల అప్పలనాయుడు, వ్యవసాయం, లక్ష్మి)
లక్ష్యం : ఇండియన్ కోస్టల్ ఉద్యోగం సాధన

డాక్టర్ కావాలని ఉంది



పేరు : బి.నవ్యశ్రీ
గ్రూపు : బైపీసీ
మార్కులు : 434
ఊరు : చోడవరం
కాలేజీ : శ్రీ విజ్ఞాన్ జూనియర్ కాలేజీ, చోడవరం
తండ్రి : రామునాయుడు. (ఆటో డ్రైవర్)
తల్లి : వరలక్ష్మి. గృహిణి.
లక్ష్యం : ఎంబీబీఎస్ చేసి డాక్టర్ కావాలని ఉంది.

ఇంజనీర్ అవుతా..



విద్యార్థి పేరు : తమ్మాన లిఖిత.
కళాశాల : ఉషోదయ జూనియర్ కళాశాల, చోడవరం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 463
తండ్రి : గవరయ్యశెట్టి. చిరువ్యాపారి
తల్లి : ధనలక్ష్మి, గృహిణి,
లక్ష్యం : ఇంజనీరింగ్ చదువుతా.

ఆర్అండ్‌బీ రోడ్డులో గోతులు పూడ్చివేత


వడ్డాది- ముకుందపురం రోడ్డుపై పూడ్చిన గోతులు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 13 : వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రహదారిలో భాగమైన మండలంలోని ముకుందపురం, కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం , ఘాట్‌రోడ్డు జంక్షన్‌ల వరకు గల ఆరు కిలోమీటర్ల రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ నెల 11వ తేదీ గురువారం 'రహదారి ఛిద్రం- ప్రయాణం నరకం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలను కంకర రాళ్లు, వెట్‌మిక్స్‌తో పూడ్చివేయించారు.